

బీఆర్‌ఎస్‌తో గుణాత్మక మార్పు
సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని ప్రభుత్వ విప్ సునీత పేర్కొన్నారు.
- 10లో



నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
బీబీనగర్ మండలంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడక సాగుతున్నాయి. 30శాతం కూడా కాంటా వేయలేదు.
- 11లో

గరిష్ఠం/కనిష్ఠం
43°/27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్


యాదాద్రీశుడి సన్నిధిలో పంచాయతీరాజ్ మంత్రి



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్శించుకున్నారు. స్వయంభూవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సువర్ణ పుష్పార్చన పూజలో పాల్గొన్నారు. మంత్రికి వేద పండితులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నృసింహుడికి నిత్యారాధనలు



స్వామివారికి పూజలు చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. ఆలయ ముఖ మండపంలోని సువర్ణమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన పూజలు జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

బునాదిగాని కాల్వను పూర్తి చేయాలి



కంచనపల్లి వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా నాయకుడు

అడ్డగూడూరు : బునాదిగాని కాల్వను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి, అజీంపేట, లక్ష్మీదేవికాల్వ, వెల్దేవి, చౌల్లరామరాం, జానకీపురంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచనపల్లి నుంచి పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అడ్డగూడూరు మండల ప్రజలకు తాగు, సాగు నీరు అందించడానికి బునాదిగాని కాల్వను త్వరగా పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలో బిక్కేరు, మూసీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్నారు. దీన్ని నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క వెంకటేష్, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చెడపల్లి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెడే చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, సుధాకర్‌రెడ్డి, బెల్లి శ్రీకాంత్, రేఖల హేమలత, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మలుగా.. అధికారులుగా

లాలనలో.. పాలనలో వారిది ప్రత్యేక స్థానం

- అధికారం, మమకారం సమపాళ్లలో చూపుతున్న యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు
- విధి నిర్వహణలో తీరికలేకున్నా.. బిడ్డల ప్రతి అంశంలోనూ తమదైన ముద్ర



అమ్మంటే.. అమ్మే! సృష్టిలో అత్యంత తీయనైన పదం అమ్మ. యుగాలు గడిచినా.. రోజులు మారినా.. మారనిది అమ్మే.. ఆమె మనసే. గృహిణిగా ఉంటూనే అద్భుతాలు చేసే అమ్మలు కొందరైతే.. ఉద్యోగ విధుల్లో తీరికలేకుండా గడుపుతూనే 'అమ్మ' బాధ్యతను నిర్వర్తించే వారు కొందరు. ఓ వైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే మరోవైపు విధి నిర్వహణలో అంకిత భావంతో సమర్థంగా పనిచేసే అమ్మలకు కొదవే లేదు. ఈ కోవలోకే వస్తారు యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు. ఉద్యోగ బాధ్యతల్లో ఊపిరి తీసుకునేంత తీరిక లేకున్నా తమ చిన్నారుల బాధ్యతలను దగ్గరుండి చూసుకుంటున్న వారు ఎందరికో ఆదర్శం. – సాక్షి, నల్లగొండ డెస్క్



తన కుమారుడితో కలెక్టర్ పమేలా సత్పతి

విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ పమేలా సత్పతి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమె తన కుమారుడి ఆలనాపాలనా చూసుకుంటున్న తీరు ఆదర్శనీయం. తన కుమారుడిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి స్ఫూర్తిగా నిలిచారు. ఆ తర్వాత ప్రాథమిక విద్య కోసం స్థానిక ప్రైవేట్ పాఠశాలలో దగ్గరుండి చేర్పించారు. కుమారుడికి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు ఇతర అంశాలపై పట్టు దొరికే విధంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. పలుచోట్లకు తనతో పాటు తీసుకెళ్లి తల్లి మమకారాన్ని పంచుతున్నారు. మొత్తంగా కలెక్టర్‌గా బిజీగా ఉంటూనే తన బిడ్డ బాగోగులను ఎప్పటికప్పుడు చూసుకుంటున్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న సమయంలోనూ పమేలా సత్పతి తన చిన్న బాబుతోనే వార్డుల్లో పరిశీలనకు వెళ్లేవారు.

బాలికలకు 'రక్ష స్నేహిత'

సమాజంలో మహిళలు, బాలికలు నిత్యం ఏదో ఓ చోట హింసకు గురవుతూనే ఉన్నారు. భద్రతపై వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కలెక్టర్ పమేలా సత్పతి 'రక్ష స్నేహిత' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన స్వీయ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారులను, ప్రజాప్రతినిధులను, వైద్యారోగ్య సిబ్బందిని భాగస్వాములను చేస్తున్నారు. విద్యార్థినులు వేధింపులకు గురైన సమయంలో ఎలా స్పందించాలి.. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ కాన్సెప్ట్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తల్లే.. మార్గదర్శకురాలు



తన తల్లితో కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టర్ పమేలా సత్పతికి తన తల్లి మార్గదర్శకురాలు. చిన్నపటి నుంచే చదువు ఎక్కువ. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆమె.. ప్రతి చిన్న అంశాన్ని కూడా తల్లితో పంచుకునేవారు. బిడ్డ చెప్పిన ప్రతి అంశాన్ని తల్లి తన మనసులో పెట్టుకుని మంచి చేసే అంశాలను తెలియజేసేవారు. ఉన్నత విద్యావంతులైన తల్లిదండ్రుల స్ఫూర్తి, ప్రోత్సాహంతోనే ఐఏఎస్ సాధించానంటున్నారు పమేలా సత్పతి.



తల్లి, తన పిల్లలతో ఎస్పీ అపూర్వరావు

శాంతిభద్రతలు కాపాడడంలో తనదైన ముద్ర వేస్తూనే.. ఏడాదిలోపు వయసున్న తన ఇద్దరు (కవలలు) పిల్లల పెంపకంలో తల్లిగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు నల్లగొండ ఎస్పీ అపూర్వరావు. విధుల్లో భాగంగా పిల్లలకు దూరంగా ఉండాల్సిన సమయంలో తన తల్లి లేదా అత్తను వారి వద్ద ఉంచి పిల్లల బాగోగులు చూసుకునేలా ఏర్పాట్లు చేస్తారు. ఖాళీ సమయంలో పిల్లలతోనే ఎక్కువగా గడుపుతారు. జిల్లాలో గంజాయిని అదుపు చేయడంలో, అంతరాష్ట్ర ముఠా దొంగల ఆటకట్టించడంలో ఎస్పీగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. సమస్య ఉందని గ్రీవెన్స్‌డేలో తన వద్దకు వచ్చే వారికి భరోసా కల్పిస్తున్నారు. షీటీంను పటిష్టం చేసి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా మోస పోకుండా ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు. విధుల్లో భాగంగా ఎంత బిజీగా ఉన్న ముందుగానే ప్రణాళికలు వేసుకుని.. తన పిల్లలతో గడిపేందుకు కూడా సమయం ఇస్తున్నారు.

అమ్మ పాత్ర కీ రోల్



అమ్మ తోడుంటే జీవితం బంగారుమయంగా మరుతుంది. ఎలాంటి సమస్య వచ్చినా సులభంగా పరిష్కరించుకోవచ్చు. ప్రతిఒక్కరి జీవితంలో అమ్మ పాత్ర కీరోల్‌గా ఉంటుంది. క్రమశిక్షణ, చదువు, భవిష్యత్‌కు తల్లే మార్గదర్శిగా నిలుస్తుంది. తల్లిగా నేను ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూస్తూనే విధులు నిర్వహిస్తున్నాను. నాకు పిల్లలు దూరంగా ఉన్నప్పుడు వీలైనంత తొందరగా.. వారి దగ్గరకు చేరేలా ప్లాన్ చేసుకుంటా. అమ్మ ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే.. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వగలుగుతుంది.

– అపూర్వరావు, ఎస్పీ

- ఒంటికాలుపై జేపీఎస్‌ల నిరసన



సమ్మెలో భాగంగా శనివారం భువనగిరిలోని అమరవీరుల స్థూపం వద్ద ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు

మేలైన భోజనం!

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి సన్నబియ్యం

- వచ్చే నెల నుంచి అమలు
- ప్రభుత్వానికి లబ్ధిదారుల వివరాలు పంపిన అధికారులు

భువనగిరిటౌన్ : చిన్నారులు, గర్భిణులు, బాలింతల శ్రేయస్సుకోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..



మరో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల నుంచి సన్నబియ్యంతో భోజనం అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులు లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం

మతాశిశు మరణాలు తగ్గించడంతో పాటు చిన్నారుల భవిష్యత్ దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు అనేక సేవలు అందజేస్తున్నాయి. పౌష్టికాహారం, బాలామృతం, కోడిగడ్లు తదితర బలవర్ధకమైన ఆహారాన్ని అందజేస్తున్నాయి. కేంద్రాలను నానాటికీ మరింత బలోపేతం చేసుకుంటూ వస్తున్నాయి.అయితే ప్రస్తుతం దొడ్డు బియ్యంతో భోజనం పెడుతుండడంతో తినడానికి లబ్ధిదారులు అనాసక్తి కనబరుస్తున్నారు. కాగా కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేయించిన వివిధ సర్వేల్లో దొడ్డు బియ్యం సమస్య ఎదురైంది. 100 శాతం లబ్ధిదారులు కేంద్రాల్లోనే భోజనం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇప్పటికే అందజేస్తున్న పౌష్టికాహారంతో పాటు వచ్చే నెల నుంచి సన్న బియ్యంతో భోజనం పెట్టాలని నిర్ణయం తీసుకుంది.

లబ్ధిదారులు ఇలా.. ఆరోగ్యలక్ష్మి పథకం కింద



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సెలవుల్లో మినహా మిగతా అన్ని రోజుల్లో భోజనం అందజేస్తున్నారు. పప్పు, కూరగాయలు, గుడ్డు, భోజనం, 200 మిల్లీ లీటర్ల పాలు అందిస్తున్నారు. చిన్నారులకు భోజనం, అల్పాహారం పెడుతున్నారు. కేంద్రాలను మరింత బలోపేతం చేయడానికి సన్నబియ్యంతో భోజనం పెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి నెలా మొత్తం 456 క్వింటాళ్ల వరకు బియ్యం అవసరం ఉంది. ఆయా కేంద్రాల్లో 3నుంచి ఆరేళ్ల వయస్సులోపు చిన్నారులు 50,160, గర్భిణులు 5,384, బాలింతలు 5,138 మంది ఉన్నారు.

నేరుగా ప్రభుత్వమే చూస్తుంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యంతో భోజనం అందజేయడానికి సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశాలు జారీ చేశాం. సన్నబియ్యం సరఫరా చేసే ప్రక్రియను నేరుగా ప్రభుత్వమే చూస్తుంది. సన్నబియ్యం భోజనం ఎప్పటినుంచి అందజేస్తారన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు రావాలి.

–రేఖల స్వరాజ్యం, సీడీపీఓ, భువనగిరి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో భువనగిరిలో సంబరాలు జరుపుకుంటున్న పార్టీ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : బీజేపీ విధానాలతో విసిగిపోయిన కర్ణాటక ప్రజలు శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీని తరిమికొట్టారని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణలోనూ కర్ణాటక పరిస్థితి ఎదురవుతుందన్నారు. శనివారం ఆయన భువనగిరిలో విలేకర్లతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై బీజేపీ చేసిన కుట్రలను ప్రజలు గమనించారని, దీనికి నిదర్శనమే కర్ణాటక ఫలితాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీని, బీఆర్‌ఎస్ పార్టీలని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలో వస్తుందన్నారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. భువనగిరిలోని కిసాన్‌నగర్ నుంచి అర్బన్ కాలనీకి వెళ్లే మార్గంలో నూతనంగా రోడ్డు నిర్మాణానికి చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, కుశంగుల ఎల్లమ్మ రాజు, చెన్న స్వాతి మహేష్, కడారి ఉమాదేవి, బానోతు వెంకట్‌నర్సింగ్ నాయక్, జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

నిప్పుల కొలిమి!

- దంచికొడుతున్న ఎండలు
- జిల్లాలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ

ఆరు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
08	31.6	40.1
09	31.8	39.0
10	32.5	40.2
11	33.3	40.1
12	32.2	42.3
13	34.1	43.3

భువనగిరి, భువనగిరి టౌన్, చౌటుప్పల్ : భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లా నిప్పులకొలిమిని తలపిస్తోంది. ఐదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. శనివారం జిల్లాలో సగటున 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వలిగొండ మండలంలో 43.4 డిగ్రీలు, రామన్నపేట 42.0, మోత్కూరు, బీబీనగర్ 41.5, ఆత్మకూర్(ఎం) 42.2, చౌటుప్పల్, బొమ్మలరామారం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, భువనగిరి, మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా మండలాల్లోనూ ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది.



బయటకు రాని జనం

ఉదయం 7 గంటలకే ఎండ మొదలై 11గంటలకు తీవ్రమవుతోంది. దంచికొడుతున్న ఎండలకు జనం బెంబేలెత్తుతున్నారు.అత్యవసరం ఉంటే తప్ప గడప దాటడం లేదు. ఉక్కపోత, వడగాడ్పు తోడవడంతో జనం ఇబ్బందిపడుతున్నారు. ఇళ్లలో కూడా విపరీతమైన వేడి ఉండడంతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. మధ్యాహ్న సమయంలో జనసంచారం లేక రోడ్లన్నీ బోసిబోయాయి.

ఆరెంజ్ అలర్ట్

జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని, ఏదైనా పని ఉంటే ఉదయం, సాయంత్రం సమయంలో పూర్తి చేసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలంలోని చేపూరు గ్రామానికి చెందిన కొమ్ము సహదేవ్ (33) స్థానిక రిలియన్స్‌స్మార్ట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. తన ఆర్థిక కుటుంబ ఇబ్బందుల కారణంగా మనస్థాపం చెంది మండల పరిధిలోని చెర్వుగట్టు దేవాలయ ఆర్చిసవిఎపాన శుక్రవారం రాత్రి దాదాపు 10గంటల సమయంలో పురుగుల మందు తాగడంతో విషయం సమీప ప్రజలు గమనించి 108కు సమాచారం అందించాడంతో 108 సహాయంతో కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు కొమ్ము సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సైదబాబా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడి మృతి

కోదాడరూరల్ : తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తొగర్రాయిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు వట్టికూటి శ్రీను(40) రోజు మాదిరిగానే కల్లుగీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాల పాలైన అతన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యువతి అదృశ్యం

భువనగిరి : ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి కుటుంబ సభ్యులు ఉదయం ఇంటి నుంచి పని కోసం ఉదయం 7 గంటలకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చారు. ఇంట్లో తన కూతురు కనిపించకపోవడంతో గ్రామంతో పాటు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడ అచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

మహిళ మెడలో ఆభరణాలు చోరీ

భువనగిరి : బస్సులో మహిళ మెడ నుంచి ఆభరణాలు చోరీ గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్‌కు చెందిన బండారి నర్సమ్మ ఈ నెల 9వ తేదీన ఆమె బంధువుతో కలిసి తుర్కాన్‌పేట వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఎల్‌బీనగర్ ఎక్స్ రోడ్డులో దిగి అక్కడి నుంచి ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి భువనగిరికి వచ్చే బస్సు ఎక్కారు. పట్టణ శివారులో ఉన్న రేణుకా ఎల్లమ్మ గుడి వద్ద దిగారు. ఈ క్రమంలో తన మెడలో ఉన్న 45 గ్రాముల పుస్తెల తాడు కనిపించలేదు.దీంతో శనివారం రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

అమ్మపై ప్రేమతో..

మాతృ దినోత్సవం

- ఆశ్రమాలు, ఫౌండేషన్ల స్థాపన
- పేదలకు అండగా నిలుస్తున్న కొందరు బిడ్డలు

నేడు మాతృదినోత్సవం

ప్రకృతిలో అన్నింటి కంటే తియ్యనైన పదం అమ్మ. నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిస్తుంది. ఆలనాపాలనా అన్నీ తానై చూసుకుంటుంది. అంతే కాదు కంటి రెప్పలా కాపాడుకుంటుంది. పిల్లలకు ఏమైనా ఆపద వస్తే తన తల్లడిల్లి పోతుంది. అందుకేనేమో అమ్మతో బిడ్డలకు వీడదీయరాని బంధం ఉంటుంది. అలాంటి అమ్మ కోసం ఎంత చేసినా తక్కువే. అందుకే కొందరు అమ్మ పేరుతో ఫౌండేషన్లు, ఆశ్రమాలు స్థాపించి రుణం తీర్చుకుంటున్నారు.

ఆపన్నులకు అండగా.. అమ్మ ఫౌండేషన్

రామగిరి(నల్లగొండ) : మిర్యాలగూడ పట్టణం గాంధీనగర్‌కు చెందిన చింతకాయల రేఖ తన పదేండ్ల వయస్సులో అమ్మను కోల్పోయింది. మొత్తం ఐదుగురు ఆడ పిల్లలు. అందులో రేఖ రెండవ సంతానం. తల్లి చనిపోయిన తర్వాత తండ్రి పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. బంధువులు ఎవరూ వారిని చేరదీయలేదు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకుని రేఖ ప్రయోజకురాలైంది. తన తల్లి జ్ఞాపకార్థం 2018లో అమ్మ ఫౌండేషన్ స్థాపించింది. ఐదు సంవత్సరాలుగా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఈ ఫౌండేషన్‌కు మూడు జాతీయ, ఒక రాష్ట్ర అవార్డులు లభించాయి.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు ఇలా..

- ఇప్పటి వరకు 5000 మంది చేత రక్తదానం.
- 50 వరకు అన్నదాన కార్యక్రమాలు.
- కరెంటు షాక్‌తో దేహం కాలిపోయిన నల్ల గొండ పట్టణానికి చెందిన బాలుడు శివతేజ చికిత్సకు రూ.6 లక్షల ఆర్థిక సాయం.
- పెద్దసూరారం గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కృతికకు రూ.50 వేల ఆర్థిక సాయం.
- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందిన చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన అఖిలకు కుటుంబానికి రూ.20 వేలు ఇచ్చారు. ఇలా ఎంతో మందికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు.



నల్లగొండలో శివతేజను పరామర్శిస్తున్న రేఖ

పేదలకు సహకారం



పెద్దదేవులపల్లిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న రాజారాంసింగ్

త్రిపురారం : పుట్టిన ఊరితో పాటు సమాజానికి ఏదో చేయాలనే ఆలోచనతో అమ్మ మీద ప్రేమతో అమ్మ స్వచ్ఛంద సేవ సంస్థను ఏర్పాటు చేసి పేదలు, విద్యార్థుల చదువులకు చేయూత నిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన ఠాకూర్ రాజారాంసింగ్. 2012లో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెద్దదేవులపల్లి గ్రామం పట్టణానికి దూరంగా ఉండడంతో పేదల కోసం అంబులెన్స్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారి కోసం హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయించి మందులు అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, క్రీడలకు బహుమతుల అందజేయడంతో పాటు యేటా పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాయడానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ఉపాధి కూలీలకు మజ్జిగ అందించడం, నీడ కోసం టెంటు ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మ దైవంతో సమానమని.. ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని అంటున్నారు ఠాకూర్ రాజారాంసింగ్.

అమ్మపేరుతో పేదలకు చేయూత



బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

భువనగిరిటౌన్ : అమ్మపేరుతో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు భువనగిరి పట్టణానికి చెందిన గుర్రాల శ్రీనివాస్. తన అమ్మ లక్ష్మమ్మ పేరుతో 2019లో ఫౌండేషన్ స్థాపించారు. అప్పటి నుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో 14 రోజుల పాటు భువనగిరిలోని 35 వార్డుల్లో ఇంటింటికీ కురగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేదలు చనిపోతే అంత్యక్రియకు అవసరమైన ఖర్చు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్నారు. పేదింటి ఆడ పిల్లల పెళ్లికి బియ్యం అందజేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 మంది విద్యార్థులకు స్కూల్ ఫీజులు కడుతున్నారు.

ఫౌండేషన్ భవనం నిర్మిస్తాం



ఫౌండేషన్ కోసం భువనగిరి పట్టణంలోని సాయిబాబా గుడివద్ద భవనం నిర్మాణం కోసం 1,000 గజాల స్థలం కొనుగోలు చేశాం. అమ్మ పేరు మీద కట్టే ఈ భవనంలో అనాథలు, పేదలకు ఆశ్రయం కల్పిస్తాం. సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తాం.

– గుర్రాల శ్రీనివాస్, చైర్మన్, గుర్రాల లక్ష్మమ్మ ఫౌండేషన్

మానసిక వికలాంగులకు 'అమ్మ ఒడి'



వంగపల్లి గ్రామంలోని అమ్మఒడి అనాథాశ్రమం

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో అమ్మ పేరుతో.. అమ్మ ఒడి మానసిక వికలాంగుల అనాథాశ్రమాన్ని నిర్వహిస్తున్నాడు జెల్లా శంకర్. ఈ ఆశ్రమాన్ని 2017లో వంగపల్లి గ్రామంలో స్థాపించారు. ఈ ఆశ్రమంలో ప్రస్తుతం 20 మందికి ఆశ్రయం కల్పించి వారి బాగోగులు చూసుకుంటున్నారు. వీరిని ప్రతి నెలా హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రి తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. మానసిక స్థితి బాగాలేక ఆశ్రమానికి వచ్చిన 68 మందిని మళ్లీ మామూలు మనుషులుగా మార్చి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఈ ఆశ్రమంలో కేర్ టేకర్‌గా సుమిత్ర సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అమ్మ ఒడిలాగా ఉండాలని ఆశ్రమాన్ని పెట్టాం



పిల్లలకు తల్లి ఒడి ఎంత హాయిగా ఉంటుందో, మా ఆశ్రమం కూడా అలానే ఉండాలని ఉద్దేశంతో అమ్మ ఒడి మానసిక వికలాంగుల అనాథాశ్రమం అని పేరు పెట్టాం. ఈ ఆశ్రమం పెట్టడానికి మా తల్లి ప్రేమనే కారణం. నా చిన్నతనంలోనే మా నాన్న చనిపోవడంతో, అమ్మనే కష్టపడి మమ్మల్ని పెంచింది. మా అమ్మ ప్రేరణతోనే ఈ ఆశ్రమం నెలకొల్పాను. ఈ ఆశ్రమం ద్వారా అనాథ మానసిక వికలాంగులకు సేవలందిస్తున్నాం.

– జెల్లా శంకర్, ఆశ్రమ నిర్వాహకుడు

ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా



కేక్‌ను కట్ చేస్తున్న డైరెక్టర్

బీబీనగర్: వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో నర్సుల పాత్ర కీలకమని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిమ్స్ వైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు నర్సులు, వైద్యులచే కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోగుల బాగోగులను చూసుకోవడంలో నర్సులు తీసుకునే బాధ్యత గొప్పదని వారికి సుముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు కల్యాణి, సుర్య ధనలక్ష్మి, అపర్ణ, అనిత, మధుసూదన్, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన మహిళ అరెస్ట్

నల్లగొండ క్రైం : ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన మహిళను నల్లగొండ టూటౌన్ పోలీస్‌లు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివరాంనగర్‌కు చెందిన పాడిచేడు వజ్రేశ్వరి గురుకుల పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారని నమ్మబలికింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తెలిసిన వారిని నమ్మించి వారి వద్ద రూ.6లక్షలు వసులు చేసింది. వారి ఉద్యోగం ఇప్పించకపోగా వారికి తిరిగి డబ్బులను ఇవ్వలేదు.అదే విధంగా సమభావన పొదుపు మహిళ సంఘంలో సభ్యురాలిగా చేరి తోటి సభ్యుల డబ్బులు రూ 4.50లక్షలు బ్యాంక్‌లో జమ చేయకుండానే మోసం చెసింది.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చెసినట్లు టూటౌన్ ఎస్సై వెమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు

భువనగిరి : యువతిని కిడ్నాప్ చేసిన ఘటనలో ముగ్గురు యువకులపై శనిశనివారం భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన యువతిని నారాయణపురం మండలానికి చెందిన ఓ వ్యక్తి కిడ్నాప్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు యువతి అచూకీ కోసం వెతికారు. ఈ క్రమంలో అదే రోజు మధ్యాహ్న సమయంలో మండలంలోని బొల్లేపల్లి గ్రామంలోని కాల్వ వంతేన ప్రక్క నుంచి వెళ్తుండగా ఎదురుగా యువతితో పాటు ముగ్గురు వ్యక్తులు ఉన్న కారు వచ్చింది.ఈ సమయంలో యువతి కుటుంబ సభ్యులను గమనించి యువతిని విడిచిపెట్టి వెళ్లారు. యువతి తల్లి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తో గుణాత్మక మార్పు

- గడప గడపకూ సంక్షేమ ఫలాలు
- ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీ విష ప్రచారం
- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఆలేరురూరల్: బీఆర్‌ఎస్‌తోనే గుణాత్మక మార్పు సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. శనివారం ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో కేసీఆర్ ఫంక్షన్ హల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ కొల్లూరు క్లస్టర్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సంక్షేమ పథకాలన్ని రాష్ట్రంలో ప్రతి పేదింటికి ఏదో ఒక రూపంలో అందుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సుమారు 350 సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులపై పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీకి కార్యకర్తలే బలం బలగం అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే మోదీ జీర్ణించుకోలేక తన అక్కసును వెల్లగక్కుతూ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్న బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిదులు స్థానిక సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. సమస్యలనీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముచ్చటగా మూడో సారి గులాబీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, సెక్రెటరి జనరల్ రచ్చ రామ్‌నర్సయ్య, గ్యాదపాక నాగరాజు, వైస్ ఎంపిపి లావణ్యావెంకటేష్, సింగిల్ విండో చైర్మన్ మల్లేషం, మామిడాల ఆంజనేయులు, ఎంపీటీసీ జూకంటి అనురాదఅనీల్, సర్పంచ్‌లు పారుపల్లి లావణ్యానర్సింహులు, పాండరి, బండ పద్మ, లక్ష్మి, కిష్టయ్య, శ్రీశైలం, కోటగిరి ఆంజనేయులు, అయిలి కృష్ణ, పాల్గొన్నారు.

పుకార్లు నమ్మొద్దు

దేవరకొండ: మండలంలో అటవీ జంతువుల సంచారం లేదని నల్లగొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి బాచిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు రోజులుగా మండల పరిధిలోని తాటికోల్, గొల్లపల్లి, కొండభీమనపల్లి గ్రామాల పరిధిలో చిరుత పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలను సందర్శించి వివరాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడా చిరుత అడుగు జాడలు గానీ ఆచూకీ గాని లభించలేదని తెలిపారు. శుక్రవారం వాట్సాప్ గ్రూప్‌ల్లో ఒక వీడియో ఫార్వర్డ్ అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ వీడియో దేవరకొండ పరిసర ప్రాంతాలకు చెందినది కాదని పేర్కొన్నారు. ఫేక్ వీడియోలు ఫార్వర్డ్ చేయొద్దని, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉరివేసుకొని గృహిణి ఆత్మహత్య



జ్యోతి (ఫైల్)

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : కుటుంబ తగాదాలతో ఉరివేసుకొని గృహిణి ఆత్మహత్య చేసుకుంది.ఈ ఘటన ఆత్మకూర్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన సాకాని అశోక్‌కు మోతె మండలం మామిళ్లగూడేనికి చెందిన దామళ్ల నాగయ్య-భూబమ్మ కుమార్తె జ్యోతిని ఇచ్చి 15 సంవత్సరాల క్రితం వివాహం జరిపారు.వీరికి 5 సంవత్సరాల బాబు ఉన్నాడు. కొంతకాలంగా కట్నం విషయంలో భార్య,భర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.కాగా శుక్రవారం అశోక్,జ్యోతి ఘర్షణ పడ్డారు.అనంతరం అశోక్ బయటకు వెళ్లగా రాత్రి 10 గంటల సమయంలో జ్యోతి ఇంట్లో ఉరివేసుకుంది.గమనించిన కుటుంబ సభ్యులు సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు.మృతురాలి తల్లి భూబమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

- వేబ్రిడ్జి సీజ్ చేసిన అధికారులు



ధర్నా చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం తూకంలో అవకతవకలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని జిల్లా తూనికల, కొలతల అధికారి సంజయ్‌కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని రాంలింగంపల్లి గ్రామ పరిధిలో గల కన్యకా పరమేశ్వరీ రైస్‌మిల్లులోని వేబ్రిడ్జిలో తూకంలో తేడాలొస్తున్నాయని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తూనికల కొలతల అధికారితో పాటు సివిల్‌సప్లై అసిస్టెంట్ మేనేజర్ బాలమణి, చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి రైస్‌మిల్లును సందర్శించారు. అక్కడ వేబ్రిడ్జి తూకం వేసి సరిచూశారు. వేబ్రిడ్జి మధ్యన బరువు తూకం వేయగా సరిగ్గానే ఉన్నా, బ్రిడ్జి చివర్లో మాత్రం సుమారు 50కిలోల మేర తేడా వచ్చింది. మరోసారి సాంకేతికంగా పరీక్షిస్తామని చెప్పి అధికారులు వేబ్రిడ్జిని సీజ్ చేశారు.

రైతుల ఆందోళన

కాగా తూకం ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఇంద్రియాల, రాంలింగంపల్లి, గౌస్‌కొండ గ్రామానికి చెందిన రైతులు రైస్‌మిల్లు వద్ద ధర్నా చేశారు. రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంద్రియాల, గౌస్‌కొండ తదితర గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మరో రైస్‌మిల్లుకు అలాట్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా చౌటుప్పల్ రూరల్‌సీఐ మహేశ్ రైతులతో మాట్లాడి అక్రమాలకు పాల్పడినట్లు తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకొంటామని హామి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు నోముల మాధవరెడ్డి, మండల నర్సింహ, గుర్రం బాల్‌రెడ్డి, వారాల రాంచంద్రారెడ్డి, గొంగిడి వెంకట్‌రెడ్డి, కోట రాంచంద్రారెడ్డి, గరిసె జంగయ్య, రమావత్ రాజు, భీమగాని నర్సింహ, పెద్దిరెడ్డి యాదగిరి, చింతల శ్రీశైలం, పానుగంటి లింగస్వామి, వారాల యాదిరెడ్డి, పబ్బు యాదయ్య, సుర్వి బాలరాజు తదితరులు ఉన్నారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): కర్ణాటక ఫలితాలు బీజేపీ మతోన్మాద తిరోగమన విధానాలకు చెంపపెట్టు లాంటిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో మతోన్మాద విధానాలను అనుసరిస్తూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతూ ఐక్యంగా ఉన్న ప్రజల మధ్యలో చిచ్చు పెట్టిందన్నారు.కర్ణాటక రాష్ట్రంలో కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి గెలిసేందుకు బీజేపీ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందని కానీ ఆ రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ సమావేశంలో నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్ రావు ,మట్టి పెల్లి సైదులు, నగారపు పాండు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

వారంలోగా ధాన్యం దిగుమతి చేయాలి

నార్కట్‌పల్లి: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో వారం రోజుల్లోగా మిల్లుల్లో దిగుమతి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. శనివారం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సివిల్ సప్లయ్ శాఖల అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వందశాతం పూర్తయిన మిల్లులు కూడా తప్పనిసరిగా మిగిలిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతిరోజూ 200 నుంచి 800 లారీల్లో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 55,118 మంది రైతుల నుంచి 4,50,132 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వి.వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ సైదులు, మిల్లర్లు పాల్గొన్నారు.

నవ సమాజ స్థాపనకు ఉద్యమించాలి



కరపత్రం విడుదల చేస్తున్న సుబ్బారావు తదితరులు

మిర్యాలగూడ టౌన్: నవ సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సుబ్బారావు పిలుపునిచ్చారు. డీటీఎఫ్, తెలంగాణ విద్యావంతుల వేదిక, విరసం ఆధ్వర్యంలో ఈనెల 15న శాంతినికేతన్ సమీపంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించే శేషు స్మారకోపన్యాస సమావేశ కరపత్రాన్ని శనివారం మిర్యాలగూడలోని శాంతినగర్‌లో సుబ్బారావు తన నివాసంలో విడుదల చేసి మాట్లాడారు. సాయంత్రం 6గంటలకు «వర్తమాన భారతంలో పాసిస్టు ధోరణులు–మన కర్తవ్యం» అనే అంశంపై స్మారకోపన్యాసం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో శేషు మిత్రమండలి సభ్యులు మౌజంహుస్సేన్, జ్వాల వెంకటేశ్వర్లు, వేనేపల్లి పాండురంగారావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.